క్లుప్తంగా

వెంకన్నకు విశేష అభిషేకాలు



పెందుర్తి: వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఐదోరోజు శుక్రవారం వేంకటేశ్వరస్వామికి విశేష అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుమురై, తిరుప్పావై పారాయణం, తీర్థగోష్ఠి నిర్వహించారు. 6 రకాల ప్రసాదాలు స్వామికి నివేదించారు. 5వ పాశురం వినిపించారు. అనంతరం ఈవో నీలిమ పర్యవేక్షణలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అప్పన్న సన్నిధిలో జస్టిస్ భడాంగ్



కప్పస్తంభం వద్ద మొక్కుకుంటున్న జస్టిస్ భడాంగ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ఇన్‌కమ్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ గౌరవాధ్యక్షుడు జస్టిస్ సి.వి. భడాంగ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికను ఏఈవో ఆనంద్ కుమార్ అందించారు.

గోదాదేవికి విశేషంగా తిరువీధి



తిరువీధిలో గోదాదేవికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గోదాదేవికి విశేషంగా తిరువీధి నిర్వహించారు. ఉదయం అమ్మవారి సన్నిధిలో పాశుర విన్నపం చేశారు. తదుపరి అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకిలో అధిష్ఠింపజేసి ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. విశేష హారతి అందించారు. అర్చకుడు రాజీవ్ తదితరుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: మాదక ద్రవ్యాల వాడకం, సైబర్ క్రైం లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ తదితర అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని, వాటికి దూరంగా ఉండాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అన్నారు. పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థుల అవగాహన కోసం శుక్రవారం సంకల్పం సదస్సు నిర్వహించారు. సదస్సులో సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జరిగే అనర్థాలను వివరించారు. మాదక ద్రవ్యాలకు బానిసలైతే జీవితాలు నాశనమవుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు నేడు

పరవాడ: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఉదయం 8.30 గంటలకు మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

అన్నదాతపై వరుణుడు కరుణ చూపలేదు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వర్షాభావంతో ఇబ్బంది పెట్టి.. పంట చేతికొచ్చే ప్రస్తుత దశలో అకాల వర్షాలతో భయపెడుతున్నాడు. రెండు వారాల క్రితం ఫెంగల్ తుపాను, ప్రస్తుత అల్పపీడనం/వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. కోసిన పనలు పొలంలో వర్షానికి తడిసి, మొలకలెత్తితే పైసా కూడా చేతికి రాదని భయపడుతున్నారు.



కరకవానిపాలెంలో తడిచిన వరిచేనును ఒడ్డుకు తరలించే ప్రయత్నం చేస్తున్న రైతు

కన్నీటిపాలు!



తడిసిన వరి పనలను ఒడ్డుకు మోసుకు వెళుతున్న రైతులు

పెందుర్తి: పక్వానికి వచ్చిన వరిచేను ముమ్మరంగా కోతలు జరుగుతున్న సమయంలో వాయుగుండం రైతన్న కల్లంలో కలకలం రేపింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట రెండుమూడు రోజుల్లో కల్లాలకు చేరుతుందన్న తరుణంలో అకాల వర్షాలు పంటను ముంచెత్తడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కోసిన పంటపై వర్షం కురవడంతో గింజలు పాడవుతాయన్న భయం వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. రానున్న రెండు రోజులు కూడా ఇదే తరహాలో వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ సమాచారంతో అన్నదాతల ఆందోళన రెట్టింపైంది.



వర్షంలో మడిలోనే కుప్పలు వేస్తున్న రైతులు

వరి పంట చివరిలో అకాల వర్షాలతో పొలాల్లోనే తడిసిన వరిచేను

నియోజకవర్గంలో దాదాపు 300 ఎకరాల్లో నీటిలోనే వరి పనలు

మరో రెండ్రోజులు వర్షాలు ఉంటాయనడంతో ఆందోళనలో రైతాంగం

వందల ఎకరాల్లో తడిసిన పంట

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పెందుర్తి మండలంలో 1555 ఎకరాల్లో, సబ్బవరంలో 3,500 ఎకరాలు, పరవాడలో 325 (నియోజకవర్గం మొత్తం 5,380 ఎకరాలు) ఎకరాల్లో వరి పంట వేశారు. దాదాపు 3 వేల ఎకరాల్లో పంటను కోసేసి కల్లాలకు తరలించారు. మిగిలిన పంట పూర్తిస్థాయిలో పక్వానికి వచ్చింది. రైతులు ముమ్మరంగా కోతలు కోస్తున్న తరుణంలో అకాల వర్షాలతో నియోజకవర్గంలో దాదాపు 300 ఎకరాల వరకు కోసిన పంట తడిసిపోయింది. వర్షాలు ఇక్కడితో ఆగిపోతే తక్కువ స్థాయిలో గింజలు పాడవుతాయి. రానున్న రెండు మూడు రోజుల పాటు వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికతో రైతులకు కంటి మీద కునుకు కరవైంది. మరోవైపు పూర్తిస్థాయిలో పక్వానికి వచ్చిన దాదాపు 2 వేల ఎకరాల్లోని వరిచేను కోతలు ఆలస్యం అయితే గింజలు రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

రెండెకరాల పంటకు నష్టం



ఈ ఏడాది కొత్త రకం వంగడం ప్రయత్నించాం. రసాయనిక ఎరువులు లేకుండా సాగు చేశాం. పంట చాలా బాగా వచ్చింది. మూడు రోజుల క్రితమే కోశాం. మూడు రోజుల్లో కుప్పలు పెడదాం అనుకుంటే.. ఈ అకాల వర్షాలకు పంట చాలావరకు తడిచిపోయింది. ఒకట్రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే భారీ నష్టం తప్పదు.

– కుచ్చు సూరిబాబు, రాంపురం

గుండె దడగా ఉంది



మా ప్రాంతంలో ఈ ఏడాది ఆలస్యంగా పంట వేశాం. దీంతో మూడు రోజుల క్రితం నుంచి కోతలు ప్రారంభించాం. ముమ్మర కోతల్లో అకస్మాత్తుగా వర్షాలు రావడంతో మా ప్రాంతంలో పంట అంతా నీటిలోనే ఉంది. కోసిన పంట తడిచిపోవడంతో కుప్పలు కూడా పెట్టలేని పరిస్థితి. ఏం చేయాలో పాలుపోక గుండె దడగా ఉంది.

– జక్కాన దేముడు, కరకవానిపాలెం

ఉప్పు ద్రావణంతో ఉపశమనం



తడిచిన వరి చేనుపై ఉప్పు ద్రావణం చల్లితే నష్టాన్ని నివారించుకోవచ్చు. ఆరని పనలు కుప్పలు వేయాలంటే ఎకరాకు 25 కిలోల కల్లు ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్పలు వేసుకోవాలి. పొలంలోనే పనులుంటే లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు ద్రావణాన్ని పనలు పూర్తిగా తడిచేలా పిచికారి చేసుకోవాలి.

– టి.దుర్గా ప్రసాద్, వ్యవసాయాధికారి

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పెందుర్తి: రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పలు ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించి, ఉపాధ్యాయులను కలిసి తనకు ఒకటవ ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ఉపాధ్యాయుల సమస్యలను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చానన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించే విషయంలో రాజీలేని పోరాటం చేస్తానన్నారు. 2025 మార్చిలో నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా గొరపల్లి, సరిపల్లి, వి.జుత్తాడ, గుర్రంపాలెం, శాంతినగర్, రాంపురం, పెందుర్తి, నరవ, చింతల అగ్రహారం, వేపగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆయన ప్రచారం చేశారు. ఆయన వెంట విశాఖ జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ కరుణాకర్, టి.రామకృష్ణ, పెందుర్తి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరరావు, సన్నిబాబు, సభ్యులు జగదీష్, కె.వెంకటరావు, జి.ఈశ్వరరావు, వెంకునాయుడు, శ్రీనివాసరావు, ప్రకాష్, వెంకటరావు, నాయుడుబాబు, సూర్యారావు, రాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.



వేపగుంట ఉన్నత పాఠశాలలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

తప్పుడు పత్రాలతో భూ కబ్జాకు ప్రయత్నం

• చర్యల కోసం గొరపల్లి రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు



ఎస్‌డీసీ సీతారామారావుకు వినతిపత్రం ఇస్తున్న కరక దేముడు తదితరులు

పెందుర్తి: గొరపల్లి సర్వే నెం.218లో కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలతో ఆన్‌లైన్, మ్యుటేషన్ చేయించుకుని రైతుల భూములు కాజేయాలని చూస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ప్రత్యేకాధికారి సీతారామారావును మాజీ సర్పంచ్, టీడీపీ మండలాధ్యక్షుడు కరక దేముడు కోరారు. గొరపల్లిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు, ప్రజల నుంచి అధికారులు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్వే నెం.218లో 77 ఎకరాల భూమి ఉండగా, కొంత మంది వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని దేముడుతో పాటు పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. రాంపురం జామివాని చెరువు ఆయకట్టులోని గొరపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 218/4లో గెడ్డను ఆక్రమించి పోతల దేముడు, కొరుపోలు రామకృష్ణతో పాటు పలువురు రైతులు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని.. వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత సాగునీటి సంఘం అధ్యక్షుడు వెన్నెల వెంకటరమణ అర్జీ పెట్టారు. సదస్సులో మొత్తం 39 అర్జీలు రాగా అందులో 24 ఎఫ్ లైన్ కోసం, 15 ఆర్‌వోఆర్ సవరణల కోసం దాఖలయ్యాయి. తహసీల్దార్ ఆనంద్‌కుమార్, సర్పంచ్ గొరపల్లి శ్రీను, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



గంగవరంలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ తదితరులు

రెవెన్యూ సదస్సులో 8 అర్జీలు

సబ్బవరం: రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై రైతుల నుంచి వచ్చిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. జీవీఎంసీ పరిధి గంగవరంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులో రైతుల నుండి 8 వినతులు అందాయన్నారు. వీటిని పరిశీలించి, పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ గణపతిరావు, కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, సీనియర్ నాయకులు ఇందల రమణ, మాజీ సర్పంచ్ మాటూరి దేముడు, వెలుగు సర్వేయర్ రాంబాబు, వీఆర్వో ఇ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఇక్కట్లు

సింహాచలం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంప్లెక్స్‌లోకి ప్రవేశించే ప్రధాన మార్గంలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు పెద్ద ఎత్తున చేరింది. బస్సుల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిన్నపాటి వర్షం పడినా ఇక్కడ ఉన్న గోతుల్లో నీరు పెద్ద ఎత్తున చేరుతోంది. అధికారులు దృష్టి సారించి, కాంప్లెక్స్ సమీపంలోని గోతుల్ని పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.



సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రధాన రహదారిపై గోతుల్లో నిలిచిన వర్షం నీరు

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పరవాడ: శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఈ నెల 22(ఆదివారం)న వాడచీపురుపల్లి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అమ్మ కంటి ఆస్పత్రి ప్రతినిధులు తెలిపారు. సంతబయలు సామాజిక భవనంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహిస్తామన్నారు.